RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com




RANGAREDDY, EDITION : 01, VOLUME :171 EDITOR: CHERUKU UPENDAR, DATE : SUNDAY 05 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 171 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 05 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-



## ఇజ్రాయిల్ దాష్టీకం..

### అంబులెన్స్ కాన్వాయ్ పై దాడి

గాజా - ప్రభాత సూర్యుడు

అంబులెన్స్ కాన్వాయ్‌పై ఇజ్రాయిల్ అమానవీయ దాడిని పాలస్తీనా రెడ్ క్రసెంట్ సొసైటీ (పిఆర్‌సిఎస్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి ఓ ప్రకటనను విడుదల చేసింది. అల్ షిఫా ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట అంబులెన్స్‌లు లక్ష్యంగా ఇజ్రాయిల్ సైన్యం క్షిపణిని ప్రయోగించిందని, ఈ దాడిలో 15 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడినట్లు ఆ ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ ఏడున గాజాలో యుద్ధ ప్రారంభమైనప్పటి నుండి అంబులెన్స్‌లు లక్ష్యంగా ఇజ్రాయిల్ చేపట్టిన దాడిలో ఎనిమిది అంబులెన్స్‌లు ధ్వంసమయ్యాయని పిఆర్‌సిఎస్ పేర్కొంది. వైద్య బృందాలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడం జెనీవా ఒప్పందం ఉల్లంఘనేనని, ఇది యుద్ధ నేరమని స్పష్టం చేసింది.

మిగతా 2లో...

# సెమీస్ రేసులోనే పాకిస్తాన్


## న్యూజిలాండ్‌పై 21 పరుగుల తేడాతో గెలుపు

బెంగళూరు - ప్రభాత సూర్యుడు



ఐసిసి ప్రపంచకప్‌లో భాగంగా ఎం చిదంబరం స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అదృష్టం పాకిస్తాన్‌ను వరించింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 402పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ జట్టు తొలుత 21.3ఓవర్లలో వికెట్ నష్టానికి 160పరుగులు చేసిన దశలో మ్యాచ్ వర్షం కారణంగా నిలిచింది. వర్షం నిలిచిన తర్వాత మళ్లీ మ్యాచ్ ప్రారంభమయ్యాక అంపైర్లు పాకిస్తాన్ జట్టు 41ఓవర్లలో 342పరుగులు చేయాల్సిందిగా నిర్దేశించారు. మ్యాచ్‌ను కొనసాగించిన పాక్ జట్టు 25.3ఓవర్లలో వికెట్ నష్టానికి 200 పరుగులు చేసిన దశలో మరో దఫా వర్షం మ్యాచ్‌కు పూర్తిగా అంతరాయం కలిగించింది. ఎంతసేపటికీ వర్షం తగ్గకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై పాకిస్తాన్ 21పరుగులు తేడాతో గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో పాకిస్తాన్ క్రీడాభిమానులు ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. ఈ విజయంతో పాకిస్తాన్ సెమీస్ అవకాశాలు మెరుగయ్యాయి. అంతకుముందు నెగ్గిన పాకిస్తాన్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు పాకిస్తాన్ పేస్ త్రయాన్ని చీల్చి చెండాడారు. ఓపెనర్ రచిన్ రవీంద్ర(108బీ 94బంతుల్లో 15ఫోర్లు, సిక్సర్) మూడో సెంచరీని నమోదు చేయగా.. కెప్టెన్ కేన్ విలియమ్సన్(95బీ 79బంతుల్లో 10ఫోర్లు, 2సిక్సర్లు) సెంచరీకి దగ్గర్లో ఔటయ్యాడు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 180పరుగులు జతచేశారు. చివర్లో గ్లెన్

మిగతా 2లో...




## 6 నుంచి మరో విడత

### ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 29వ విడత ఎన్నికల బాండ్ల విక్రయాలకు తెర లేచింది. ఈ నెల 6 నుంచి ఈ బాండ్ల అమ్మకాలు ప్రారంభించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)కు చెందిన 29 శాఖల్లో (బెంగళూరు, లక్నో, సిమ్లా, డెహ్రాడూన్, కలకత్తా, గౌహతి, చెన్నై, పాట్నా, ఢిల్లీ, చండీగఢ్, శ్రీనగర్, గాంధీనగర్, భోపాల్, రాయపూర్, ముంబయి తదితర నగరాల్లో) వీటిని విక్రయించనున్నారు. 2018 నుంచి ఇప్పటివరకూ 28 విడతల్లో ఎన్నికల బాండ్లను విక్రయించారు.

ఎలక్టోరల్ బాండ్ల

మిగతా 2లో...

# కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి సేవలో కేసీఆర్

సిద్దిపేట - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వెంకన్న సన్నిధిలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న సీఎం కేసీఆర్‌కు మంత్రి హరీశ్ రావు స్వాగతం పలుకగా, అర్చకులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసి.. వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. స్వామివారి సన్నిధిలో నామినేషన్ పత్రాలపై సీఎం కేసీఆర్ సంతకాలు చేశారు. ఎన్నికల్లో నామినేషన్ వేసే ప్రతిసారి కేసీఆర్ ఈ ఆలయంలో పూజలు చేస్తూ వస్తున్నారు. ఈ నెల 9న గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో నామినేషన్లు వేయనున్నారు. అదేరోజు బీఆర్ఎస్ ఆశీర్వాదసభల్లో పాల్గొననున్నారు. కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం సీఎం కేసీఆర్, పార్టీకి సెంటిమెంట్‌గా ఉంది. ఏ ఎన్నికలు వచ్చినా ఇక్క డ పూజలు చేసిన తర్వాతే సీఎం కేసీఆర్ నామినేషన్ వే స్తారు. సీఎం కేసీఆర్, హరీశ్‌రావు , ఇతర పార్టీ నేతలు ఎన్నికల సమయంలో వెంకన్నకు దర్శనం చేసుకొని స్వా మివారి సన్నిధిలో నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. కోనాయిపల్లి వెంకన్నకు

మిగతా 2లో





## చంద్రబాబును పరామర్శించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

టిడిపి అధినేత చంద్రబాబును జనసేన అధినేత పవన్ కల్యాణ్ పరామర్శించారు. శనివారం సాయంత్రం నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్టోబరు 31న రాజమహేంద్రవరం జైలు నుంచి విడుదలైన చంద్రబాబు వైద్య పరీక్షల కోసం ఇటీవల హైదరాబాద్ వచ్చారు. శు క్రవారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వైద్యులు అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు గుండె, ఊపిరితిత్తులు, చర్మ అలర్జీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. రెండ్రోజుల్లో చంద్రబాబు ఎల్వీపీఈఐలో నేత్ర పరీక్షలతో పాటు సర్జరీ చేయించుకుంటారని సమాచారం.

# కేసీఆర్ అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టు బలయింది

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కేసీఆర్ అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టు బలయిందని, కేసీఆర్ కుటుంబం ఆర్థిక ఉగ్రవాద కుటుంబం అని రేవంత్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబంపై మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపడడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందన్నారు. కాళేశ్వరంపై జాతీయ స్థాయిలో ఒక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరగాలన్నారు. ప్రధాని మోడీ తెలంగాణకు వచ్చినప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాలని కోరారు. మేడిగడ్డ బ్యారేజ్‌కు జరిగిన డ్యామేజ్ పై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ మొదలు పెట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చారన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఆలోచనలు మారి ఆశలు పెరిగాయన్నారు.’ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజుల ప్లానింగ్ వేరు, నిర్మాణం వేరుకావడం వల్లే మునిగిపోతున్నాయి.కేసీఆర్ ధనదాహానికి మేడిగడ్డ కుంగింది. కాళేశ్వరం కోసం తన మెదడును ఖర్చు చేశానని చెప్పిన కేసీఆర్ లోపాలు బయట పడగానే తప్పించుకుంటున్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అడిగే ప్రశ్నలకు కేసీఆర్ ఎందుకు సమాధానం ఇవ్వడం లేదు. ఎల్ అండ్ టీ కంపెనీపై చర్యలు తీసుకోవడానికి కేసీఆర్ ఎందుకు వెనకాడు తున్నారు. కమిషన్లు నొక్కేయ డానికే కేసీఆర్ ప్రణాళిక బద్దంగా ప్లాన్ వేశారు’ అని రేవంత్ విమర్శించార.



### కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై దర్యాప్తు జరపాలి : వైఎస్ షర్మిల

కమీషన్ల కక్కుర్తి వల్లనే కాళేశ్వరానికి ఈ దుస్థితి పట్టిందని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేసీఆర్ మాటలు పేరు గొప్ప ఊరు దిబ్బ లెక్కుందని ఎద్దేవా చేశారు. నా రక్తం, నా చెమట అని కల్లబొల్లి మాటలు చెప్పి నమ్మించాలని చూశారనీ, అయితే ఆ ప్రాజెక్టు పేక మేడల్లా కూలిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజల సంపద రూ.1.27 లక్షల కోట్లు ఎందుకు ఖర్చు పెట్టినట్టు అని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజ్ పై డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన రిపోర్టు పరిశీలిస్తే.. మెగా అవినీతికి నిదర్శనమని విమర్శించారు.

మిగతా 2లో

# ఇజ్రాయిల్ దాష్టీకం..
# అంబులెన్స్ కాన్వాయ్ పై దాడి

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక కాలమానం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4.05 గంటల సమయంలో పాలస్తీనా ఆరోగ్య శాఖ నిర్ణయం మేరకు అల్ షిఫా ఆస్పత్రి నుండి అంబులెన్స్‌కాన్వాయ్ బయలు దేరింది. ఈ కాన్వాయ్ లో ఆరోగ్య శాఖకి చెందిన నాలుగు అంబులెన్స్‌లు, ఒకటి పిఆర్‌సిఎస్ అంబులెన్స్ ఉన్నాయని తెలిపింది. ఆస్పత్రి నుండి నాలుగు కిలోమీటర్లు ప్రయాణించిన కాన్వాయ్ .. ఇటీవల ఈజిప్ట్ తెరిచిన రఫా సరిహద్దు దాటింది. అక్కడి నుండి సరైన రహదారి లేకపోవడంతో వెనక్కి తిరిగింది. తిరిగి అల్ షిఫా ఆస్పత్రికి చేరుకునే సమయంలో మొదటి అంబులెన్స్ లక్ష్యంగా ఇజ్రాయిల్ క్షిపణితో విరుచుకుపడినట్లు పిఆర్‌సిఎస్ తెలిపింది. ఈ అంబులెన్స్‌లలో హమాస్ ఉగ్రవాదులను, ఆయుధాలను తరలిస్తున్నట్లు ఇజ్రాయిల్ వాదిస్తోంది. తమ దాడిలో పెద్ద సంఖ్యలో హమాస్ ఉగ్రవాదులు మరణించినట్లు ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. అయితే ఈ వాదనను నిర్ధారించే ఎలాంటి ఆధారాలు చూపలేదు.

ఇజ్రాయిల్ వాదనను పాలస్తీనియన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి అష్రఫ్ అల్ -ఖుద్రా తీవ్రంగా ఖండించారు. తీవ్రంగా గాయపడిన వారిని అత్యవసర చికిత్స కోసం ఈ అంబులెన్స్‌లలో ఈజిప్ట్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు ఇజ్రాయిల్ దాడిలో సుమారు 9,299 మంది పాలస్తీనియన్లు మరణించగా, 25, 000 మందికి పైగా గాయపడ్డారని గాజా వైద్య శాఖ తెలిపింది. అంబులెన్స్‌పై దాడిని ఐరాస అధ్యక్షుడు అంటోనియో గుటెరస్ ఖండించారు. ఈ దాడి ఘటన తనను భయాందోళనకు గురిచేసిందని అన్నారు. ఆస్పత్రి వెలుపల వీధిలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాల దృశ్యాలు భయానకంగా ఉన్నాయని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

# కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి సేవలో కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

పూజలు చేసిన ప్రతిసారి సీఎం కేసీఆర్ కేసీఆర్‌కు విజయం వరించింది. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి 1989, 1994, 1999, 2001, 2004, 2009, 2014, 2018లో జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఆలయంలో నామినేషన్ పత్రాలకు పూజలు చేసి, నామినేషన్ వేశారు. అన్ని సందర్భాల్లోనూ విజయం సాధించారు. మరో విశేషం ఏమిటంటే, 2001లో టీడీపీకి, శాసనసభ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసిన కేసీఆర్.. ఆ తర్వాత ఈ ఆలయంలోనే పూజలు చేసి టీఆర్ఎస్ పార్టీని ప్రకటించారు.

## 6 నుంచి మరో విడత
# ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

(మొదటిపేజీ తరువాయి)

విక్రయం క్విడ్ ప్రోకోకు దారితీస్తోందని, అధికార పార్టీలకే భారీగా నిధులు వస్తున్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక ఇప్పటికే బయటపెట్టింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాల్ చేస్తూ సిపిఐ(ఎం), ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును ఇంకా వెల్లడించాల్సి ఉంది. గత లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో ఒకశాతం కంటే ఎక్కువ ఓట్లు పోలైన పార్టీలకు నిధులు సమకూర్చాలని భావించే వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు ఈ బాండ్లను కొనుగోలు చేయొచ్చు. జారీ అయిన తేదీ నుంచి 15 రోజుల వరకే ఇవి చెల్లుబాటవుతాయి. గడువు తేదీ ముగిసిన తర్వాత బాండ్లను జమ చేసినా నగదు జమ కాదు. ఎలక్టోరల్ బాండ్లను సిపిఐ(ఎం) మినహా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తీసుకుంటున్నాయి. రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయడమే ఈ ఎలక్టోరల్ బాండ్ల విధానం ఉద్దేశమని, అందుకే దీనిని రద్దు చేయాలని మార్క్సిస్టు పార్టీ, ఇతర ప్రజాతంత్ర శక్తులు డిమాండ్ చేస్తున్నాయి.

# కేసీఆర్ అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టు బలయింది
## అంధకారంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ భవిష్యత్

(మొదటిపేజీ తరువాయి)

**జయశంకర్ భూపాలపల్లి:** లక్ష కోట్ల అప్పులు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ భవిష్యత్ అంధకారంగా మారిందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శనివారం కుంగిన మేడిగడ్డ డ్యామ్‌ను బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, ఎంపీ లక్ష్మణ్ పరిశీలించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యత, నిర్మాణ లోపంతో మేడిగడ్డ బ్యారేజ్‌కు పగుళ్లు ఏర్పడి దెబ్బతిందని తెలిపారు. ఈ ఘటన తెలియడంతోనే కేంద్ర జలశక్తి నిపుణులకు లేఖ రాయడం జరిగిందని.. జాతీయ డ్యాం సేఫ్టీ అధికారులు వచ్చి చాలా తీవ్రమైన అంశాలు అందులో పొందుపరిచారని ఆయన చెప్పారు. అన్నారం బ్యారేజీ కింద పియర్స్ నుంచి వాటర్ నాణ్యత లోపం వల్లే వృధాగాపోతోందన్నారు. ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ నీరు కూడా నిల్వలేదన్నారు. వేలకోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని అన్నారు. రాష్ట్ర ప్రజలు, ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. ప్రాజెక్టు నిర్మాణం శాస్త్రీయబద్ధంగా లేదన్నారు. సీఎం కేసీఆర్ ఇంజనీరుగా అవతారమెత్తి, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించడంతో ఈ దుస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ప్రాజెక్టు గుదిబండగా మారిందన్నారు. రైతులకు ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఉపయోగం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి సీబీఐ దర్యాప్తుకు అంగీకరించాలన్నారు. లక్షల కోట్ల ప్రజాధనం గోదావరి పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు 20 అంశాలపైన డాటా అడిగితే రాష్ట్ర ప్రభుత్వం 11 అంశాలపైనే నివేదిక ఇచ్చిందని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# సెమీస్ రేసులోనే పాకిస్తాన్

(మొదటిపేజీ తరువాయి)

ఫిలిఫ్స్(41), మార్క్ చాప్మన్(39), మిచెల్ శాంట్నర్(22నాటౌట్) బ్యాట్ ఝుళిపించారు. ఓపెనర్ డెవాన్ కాన్వే(35) నిరాశపరచగా.. బటన వేలి గాయం నుంచి కోలుకున్న విలియమ్సన్ మరోసారి బ్యాట్ ఝుళిపించాడు. న్యూజిలాండ్ బ్యాటర్లు ధాటికి పాస్ స్పీడ్‌స్టర్ షాహీన్ అఫ్రిది 90పరుగులు సమర్పించుకున్నాడు. ఈ ఏడాది 24 వన్డేల్లో అతడు ఒక్క వికెట్ కూడా తీయకపోవడం ఇదే మొదటిసారి. పాక్ బౌలర్లందరూ ధాటిగా పరుగులు సమర్పించుకోవడంతో న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 401పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. పాకిస్తాన్ బౌలర్లలో మహ్మద్ వసీం జూనియర్‌కు మూడు, రవూఫ్, ఇఫ్తికార్, హసన్ అలీకి ఒక్కో వికెట్ దక్కాయి.

భారీ ఛేదనకు దిగిన పాకిస్తాన్‌కు రెండో ఓవర్లోనే ఓపెనర్ అబ్దుల్లా షఫీక్(6) వికెట్‌ను కోల్పోయింది. కెప్టెన్ బాబర్‌తో కలిసి జమాన్ కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. 39 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన జమాన్.. గ్లెన్ ఫిలిప్స్ వేసిన 15వ ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టాడు. 17వ ఓవర్లో జమాన్ 6, 4, 4తో రెచ్చిపోయాడు. సౌథీ వేసిన 19వ ఓవర్లో భారీ సిక్సర్ కొట్టి 90లలోకి వచ్చిన ఫకర్.. శాంట్నర్ వేసిన 20వ ఓవర్లో తొలి బంతికి సిక్సర్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసి సెంచరీ పూర్తిచేశాడు. 63 బంతుల్లోనే అతడి సెంచరీ పూర్తయింది. ఈ వరల్డ్ కప్‌లో పాకిస్తాన్ తరఫున ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. వర్షంతో మ్యాచ్ నిలిచే సమయానికి ఫకర్(126నాటౌట్‌బీ 81బంతుల్లో 8ఫోర్లు, 11సిక్సర్లు), బాబర్(63నాటౌట్‌బీ 63బంతుల్లో 6ఫోర్లు, 2 సిక్సర్లు) విధ్వంస ఇన్నింగ్స్ ఆడారు. ఈ గెలుపులో పాకిస్తాన్ జట్టు 8పాయింట్లతో 5వ స్థానానికి ఎగబాకింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫకర్ జమాన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి)రిజ్వాన్ (బి)హసన్ అలీ 35, రవీంద్ర (సి)షాద్ షకీల్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 108, విలియమ్సన్ (సి)ఫకర్ జమాన్ (బి)ఇఫ్తికార్ అహ్మద్ 95, మిచెల్ (బి)హారీస్ రవూఫ్ 29, చాప్మన్ (బి)మహ్మద్ వాసీం జూనియర్ 39, ఫిలిప్స్ (బి)మహ్మద్ వాసిం జూనియర్ 41, సాంట్నర్ (నాటౌట్) 26, లాథమ్ (నాటౌట్) 2, అదనం 26. (50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 401పరుగులు.

వికెట్ల పతనం: 1/58, 2/248, 3/261, 4/318, 5/345, 6/386

బౌలింగ్: షాహిన్ అఫ్రిది 10-0-90-0, హసన్ అలీ 10-0-82-1, ఇఫ్తికార్ అహ్మద్ 8-0-55-1, హారీస్ రవూఫ్ 10-0-85-1, మహ్మద్ వాసిం జూనియర్ 10-0-60-3, అఘా సల్మాన్ 2-0-21-0

పాకిస్తాన్ ఇన్నింగ్స్: అబ్దుల్లా షఫీక్ (సి)విలియమ్సన్ (బి)సౌథీ 4, ఫకర్ జమాన్ (నాటౌట్) 126, బాబర్ అజామ్ (నాటౌట్) 66, అదనం 4. (25.3ఓవర్లలో వికెట్ నష్టానికి) 200పరుగులు.

వికెట్ల పతనం: 1/6

బౌలింగ్: బౌల్ట్ 6-0-50-0, సౌథీ 5-0-27-1, సాంట్నర్ 5-0-35-0, ఫిలిప్స్ 5-1-42-0, ఇష్ సోథీ 4-0-44-0, మిచెల్ 0.3-0-1-0.

## కేసీఆర్ మళ్లీ గెలవకపోతే
# హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది

## మంత్రి కేటీఆర్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. జలవిహార్‌లో ఏర్పాటు చేసిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 70లక్షల మంది రైతులకు రైతు బంధు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు."హైదరాబాద్‌లో ఉంటే.. అమెరికాలో ఉన్నట్టు ఉందని రజినీకాంత్ అన్నారు. హైదరాబాద్‌లోనే ఇల్లు కొనుక్కోవాలని అనిపిస్తోందని బిజెపి ఎంపీ సన్నీ దేవోల్ అన్నారు. హైదరాబాద్‌లో అభివృద్ధి అందరికీ కనిపిస్తోంది గానీ.. విపక్షాలకు కనిపించట్లేదు. కేసీఆర్ మళ్లీ గెలవకపోతే పెరుగుతున్న హైదరాబాద్ అభివఅద్ధి ఆగిపోతుంది. కేసీఆర్‌ను ఓడించడానికి అందరూ ఏకమవుతున్నారు.

కేసీఆర్ సింహం లాంటి వారు.. సింగిల్‌గానే వస్తారు. తెలంగాణ సీఎం ఎవరు అనేది ప్రజలు నిర్ణయించాలి.. మోడీ, రాహుల్ కాదు. ఈ పోరాటం ఢిల్లీ దొరలకు.. తెలంగాణ ప్రజలకు మధ్యే జరుగుతోంది.తెలంగాణ ప్రజలకు పోరాటం కొత్త కాదు. గతంలో నెహ్రూ, ఇందిరతోనూ కొట్లాడారు. అప్పుడు సోనియాతో.. ఇప్పుడు మోదీతో కొట్లాడుతున్నాం. కాంగ్రెస్‌లో సీఎంలు దొరికారు.. కానీ, ఓటర్లు దొరకడం లేదు. జానారెడ్డి ఎన్నికల్లో పోటీ చేయరు.. కానీ, సీఎం పదవి కావాలి. తెలంగాణలో సమ్మిళిత వృద్ధి ఉంది. రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు రూ.10లక్షల కోట్లకు చేరుకున్నాయి. 24వేల కొత్త పరిశ్రమలు తెలంగాణకు వచ్చాయి. హైదరాబాద్‌లో పెట్టాలనుకున్న ఫాక్స్‌కాన్ సంస్థను కర్ణాటకలో పెట్టాలని, తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని డీకే శివకుమార్ ఆ సంస్థకు లేఖ రాశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో పరిశ్రమలన్నీ కర్ణాటకకు పోతాయి" అని మంత్రి కేటీఆర్ విమర్శించారు.

# కేసీఆర్ రెండో విడత పర్యటించే నియోజకవర్గాలు ఇవే..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గాల పర్యటన రెండో షెడ్యూల్ ఖరారైంది. ఇప్పటికే అక్టోబర్ 15 నుంచి ప్రారంభమైన అధినేత పర్యటనలు గురువారం (నవంబర్ 3, 2023) నాటికి 12 రోజుల్లో 30 నియోజకవర్గాల్లో విజయవంతమయ్యాయి. ఈ నెల 5 నుంచి 8 వ తేదీ వరకు మరో 11 నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ పర్యటన చేపట్టనున్నారు. రెండో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13 నుంచి 28వ తేదీ వరకు సీఎం కేసీఆర్ 16 రోజులపాటు నియోజకవర్గాల పర్యటన కొనసాగనున్నది. ఇందులో భాగంగా 54 నియోజకవర్గాలల్లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొంటారు.

ఈ నెల 28వ తేదీన గజ్వేల్ నియోజకవర్గంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభతో అధినేత పర్యటన ముగియనుంది. దాంతో మొత్తం 95 నియోజకవర్గాల పర్యటన పూర్తికానున్నది.

**నియోజకవర్గాలు ఇవే..**

1. ఈనెల 13న ధమ్మపేట్ ( అశ్వరావుపేట ), బూర్గంపాడు ( భద్రాచలం, ఫినపాక ) నర్సంపేట.
2. 14న పాలకుర్తి, హాలియా ( నాగార్జున సాగర్ ), ఇబ్రహీంపట్నం.
3. 15న బోధన్, నిజామాబాద్ (అర్బన్ ), ఎల్లారెడ్డి, మెదక్.
4. 16న అదిలాబాద్ , భోద్, నిజామాబాద్ రూరల్ , నర్సాపూర్.
5. 17న కరీంనగర్, చొప్పదండి, పరకాల ,హుజూరాబాద్.
6. 18న చేర్యాల జనగాం రోడ్ షో.
7. 19న అలంపూర్, కొల్లాపూర్, నాగర్ కర్నూల్, కల్వకుర్తి.
8. 20న మానకొండూర్, స్టేషన్ ఘన్‌పూర్, నకిరేకల్, నల్గొండ.
9. 21న మధిర, వైరా, డోర్నకల్, సూర్యాపేట.
10. 22న తాండూర్, కొడంగల్, పరిగి, మహబూబ్‌నగర్.
11. 23న మహేశ్వరం, వికారాబాద్, జహీరాబాద్, పటాన్ చెరువు .
12. 24న మంచిర్యాల, రామగుండం, ములుగు, భూపాల్‌పల్లి .
13. 25న హైదరాబాద్‌లో పబ్లిక్ మీటింగ్.
14. 26న ఖానాపూర్, జగిత్యాల, వేములవాడ, దుబ్బాక.
15. 27న షాద్‌నగర్, చేవెళ్ల, ఆందోల్, సంగారెడ్డి.
16. 28న వరంగల్ వీస్ట్, వెస్ట్, గజ్వేల్

# కేసీఆర్ అంటే విశ్వాసం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



'నేనెందుకు కబ్జాలు చేస్తా? నాకే ఏడెనిమిది వందల ఎకరాల భూముంది. కష్టపడి సంపాదించున్న. తెలంగాణలో జరిగిన అభివృద్ధితో నా ఆస్తుల విలువ అమాంతం పెరిగింది. కబ్జా చేసినట్టు నిరూపించండి. అది నిజమైతే నేనే దగ్గరుండి రిజిస్ట్రేషన్ చేయిస్తా. ఎవరిష్టమొచ్చినట్టు వారు మాట్లాతారు. దారిన పోయే దానయ్య చేసే ఆరోపణలు పట్టించుకోను' అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. 'కిషన్‌రెడ్డి లేఖ రాశారంట..డ్యామ్ స్టేఫీ వాళ్లు వచ్చి కాళేశ్వరం అడుగుకుపోయిరంట డ్యామ్ పనికిరాదని నివేదిక ఇచ్చిరంట..ఒక్కరోజులో ఇదంతా సాధ్యమా? బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి కాళేశ్వరంపై కమిటీ రిపోర్టు ఇచ్చింది. ఇదంతా ఎన్నికల స్టంట్' అని విమర్శించారు. కేసీఆర్ అంటే విశ్వాసమనీ, బీఆర్ఎస్ అంటే భరోసా అని చెప్పారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని నొక్కి చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతున్నదనీ, అన్నింటిలోనూ నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు. 56 ఏండ్లు పాలించిన కాంగ్రెసోళ్లు కరెంటు ఇచ్చే అవకాశమున్నా ఇవ్వలేకపోయారనీ, సరిపోను నీళ్లున్నా ప్రజలకు అందించలేకపోయారని విమర్శించారు. వాళ్లకు పరిపాలించ చేత కాలేదన్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి కొనుక్కుని సీట్లు అమ్ముకుంటున్నాడని కాంగ్రెస్ నేతలే ఆరోపిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఆలూలేదు సూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టుగా కాంగ్రెసోళ్లు అప్పుడే తాము గెలిచి ఎమ్మెల్యేలు అయినట్టు భ్రమించి మంత్రి పదవుల కోసం కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. కర్నాటకలో కాంగ్రెస్ గెలిచిందని జబ్బలు సరుసుకుంటే సరిపోదన్నారు. దేశమంతటా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తూ వస్తోందన్నారు. ప్రాంతీయ పార్టీలున్న చోట్ల బీజేపీ పప్పులు ఉండకట్లేదన్నారు. పాలనలో ప్రజలపై భారాలు మోపే విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని విమర్శించారు. మోడీ పాలన మస్తు ఫిరమైపోయిందనీ, ధరలు పెంచుకుంటూ పోతే పేదలు ఎట్లా బతుకుతారని ప్రశ్నించారు. రాష్ట్ర సంపద పెంచుడు పేదలకు పంచుడు ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాకనే మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. తాను విద్యాసంస్థలు, యూనివర్సిటీ పెట్టి దేశంలోనే ఎక్కడా లేని విధంగా 220 కోర్సుల్లో విద్య అందిస్తున్న ఘనత తనదన్నారు. 40వేలకు పైగా విద్యార్థులు తమ కళాశాల్లో ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్నారని చెప్పారు. తనకే డబ్బులు ఫుల్‌గా ఉన్నాయనీ, వేరేవాళ్ల ఆస్తులను కబ్జా చేయాల్సిన అవసరం తనకు లేదని కొట్టిపడేశారు. జవహర్‌నగర్‌లో 40 వేల మంది పేదలకు ఇండ్ల స్థలాల సమస్యను క్లియర్ చేసిన ఘనత తనదన్నారు. డంపింగ్ యార్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తట్టుకోలేక కేటీఆర్ వెంట పడి అక్కడ చెత్త ద్వారా విద్యుత్ తయారు చేసే ప్లాంట్ పెట్టించామన్నారు. 300 మంది కాదు..ఎంత మంది అయినా సరే తనపై పోటీ చేసే హక్కుందనీ, ప్రజలు తననే ఆశీర్వదిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఇలా అయతే..ముందుకు ఎలా

2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కొద్ది నెలల ముందు జరుగుతున్న ఈ 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సెమీ ఫైనల్‌గా పరిగణిస్తున్నాయి. హిందీ మాతృభాషగా కలిగిన రాష్ట్రాల్లో గట్టి పట్టున్న బీజేపీని ఎదుర్కోవాలంటే బీజేపీ వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేయాలని భావించిన కాంగ్రెస్ పార్టీకి హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో సాధించిన విజయం ఆత్మవిశ్వాసాన్ని, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ ఉత్సాహంతో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రాల్లో గెలుపొందడానికి ఉన్న ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలి పెట్టుకోవద్దని భావిస్తోంది. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)తో పోటీ పడుతుండగా.. మిగతా మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)యే ఉంది. సాధారణంగా ఎక్కడైనా రాజకీయ పార్టీల మధ్య పొత్తులు పరస్పర ప్రయోజనాలకు కల్గిస్తాయి. కానీ ఈ నాలుగు రాష్ట్రాల్లో పొత్తులు కాంగ్రెస్ పార్టీకి పెద్ద సమస్యగా మారాయి.విపక్ష కూటమి (ఎ.ఔ.ఆ.ఎ.ం) ఏర్పడినప్పుడు, విబేధాలు మరచి పరస్పర సహకారంతో బీజేపీని ఓడించడమే తమ ఏకైక లక్ష్యమని విపక్షాలన్నీ పదే పదే పునరుద్ఘాటించాయి. కానీ ఆ తర్వాత కొద్ది రోజులకే వచ్చిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఏ కోశానా ఈ మాటను నిలబెట్టుకునే ప్రయత్నం చేసినట్టుగా కనిపించడం లేదు. ఇందుక్కారణం.. పొత్తులతో లాభం కంటే నష్టమే ఎక్కువ అని కాంగ్రెస్ అంచనా వేయడమే. సమాజ్‌వాదీ పార్టీ మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని పోటీ చేయాలని భావించింది. ఈ మేరకు సంప్రదింపులు కూడా జరిగాయి. ఒక దశలో మధ్యప్రదేశ్‌లో 6 సీట్లు, రాజస్థాన్‌లో 10 సీట్లు ఆ పార్టీకి కేటాయించాలని పట్టుబట్టింది. సాధారణ పరిస్థితుల్లో కొన్ని సీట్లు మిత్రపక్షాలకు ఇవ్వడం వల్ల నష్టం లేకపోగా, ఎంతో కొంత ప్రయోజనమే ఉంటుంది. కానీ కాంగ్రెస్ ? బీజేపీ మధ్య ముఖాముఖి పోరు ఉన్న రాష్ట్రాల్లో మరో ప్రాంతీయ పార్టీకి అవకాశం కల్పిస్తే మొదటికే మోసం అని కాంగ్రెస్ ఆందోళన చెందుతోంది. కేవలం ఉత్తర్‌ప్రదేశ్‌లో మాత్రమే పట్టున్న సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ పార్టీలు హిందీ మాట్లాడే ఇతర రాష్ట్రాల్లో అడపా దడపా పోటీ చేయడం, స్థానిక నేతల వ్యక్తిగత బలం కారణంగా ఒకట్రెండు స్థానాల్లో గెలుపొందడం జరుగుతోంది. అయితే సమాజ్‌వాదీ పార్టీ ఈసారి కాంగ్రెస్‌తో జట్టుకట్టి మరిన్ని ఎక్కువ స్థానాల్లో గెలుపొందాలని, తద్వారా ఆ రాష్ట్రాల్లోనూ తమ పార్టీని విస్తరించి జాతీయ పార్టీగా అవతరించాలని భావిస్తోంది. కాంగ్రెస్ మాత్రం తాము బలంగా ఉన్నచోట ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంకో పార్టీకి అవకాశం ఇవ్వొద్దని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. సమాజ్‌వాదీ కోసం కాంగ్రెస్ ఎన్ని సీట్లు కేటాయించినా.. అక్కడ కాంగ్రెస్ టికెట్ ఆశించిన నేతతో పాటు కార్యకర్తలు వెంటనే తిరుగుబాటు చేసి బీజేపీలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. మళ్లీ ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ కోలుకోవడం కష్టంగా మారుతుంది. 90వ దశకంలో యూపీలో బీఎస్పీతో పొత్తు తర్వాత కాంగ్రెస్ ఎదుర్కొన్న అనుభవాలు ఇదే పాఠాన్ని బోధించాయి.సమాజ్‌వాదీతోనే కాదు, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), సీపీఐ, సీపీఐ(ఎం)లలో ఏ ఒక్క పార్టీతో కూడా పొత్తు పెట్టుకోకుండానే కాంగ్రెస్ ముందడుగు వేస్తోంది. ఇదే సమయంలో ఈ పార్టీలు చీల్చే ఓట్ల ద్వారా తమకు ఎక్కడైనా నష్టం జరుగుతుందా అన్న ఆందోళన కూడా కాంగ్రెస్ నేతల్లో అంతర్లీనంగా ఉంది. ఈ పార్టీలన్నీ కలిసి బీజేపీ వ్యతిరేక ఓటును చీల్చిన పక్షంలో అది కచ్చితంగా బీజేపీకే లబ్ది చేకూర్చుతుంది. నేతల నుంచి గ్రౌండ్ రిపోర్టులు, సమాచారం అందుకున్న కాంగ్రెస్ అధిష్టానం ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక వ్యూహం రచించింది. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర యూనిట్లకు మార్గదర్శనం చేస్తోంది. ఆ ప్రకారం క్రియాశీల పార్టీ కార్యకర్తలు, వాలంటీర్లతో కూడిన ప్రత్యేక బృందాలు ఇతర ప్రతిపక్ష పార్టీలు పోటీ చేసే నియోజకవర్గాలకు వెళ్లాలి. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు కాకుండా మరే ఇతర పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి లాభం చేకూరుతుందని ప్రజలకు వివరించి చెప్పాలి. తద్వారా జాతీయస్థాయిలో తమ మిత్ర కూటమిలో ఉన్న పార్టీలపై మాటలదాడి చేయకుండా.. తమ సందేశాన్ని ప్రజలకు చేరవేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు ఎ.ఔ.ఆ.ఎ.ం పార్టీలను బీజేపీకి కోవర్టులనో.. బీ–టీమ్ అనో నిందించడం కూడా మానుకోవాలి. కాంగ్రెస్ నేతల ప్రసంగాలు, విలేకరుల సమావేశాలలో రాష్ట్రంలో ప్రత్యక్ష పోటీ తమకు బీజేపీకి మధ్యనే ఉందని పదే పదే నొక్కి చెప్పాలి. బీజేపీని ఓడించేందుకు వేసే ప్రతి ఓటూ కాంగ్రెస్‌కే దక్కేలా అన్ని విధాలుగా ప్రయత్నించాలి. ఇదీ క్లుప్తంగా కాంగ్రెస్ వ్యూహం సారాంశం.ఉత్తరాది రాష్ట్రాల్లో అనుభవాలకు తోడు స్థానిక పరిస్థితుల రీత్యా కమ్యూనిస్టులతో పొత్తుల విషయంలో తెలంగాణలో వెనుకడుగు వేస్తున్నట్టు కనిపిస్తోంది. తొలుత సీపీఐకి చెన్నూరు, కొత్తగూడెం ఇస్తామని కాంగ్రెస్ హైకమాండ్ నుంచి కేసీ వేణుగోపాల్ స్వయంగా ఆ పార్టీ నేతలకు ఫోన్ చేసి చెప్పారు. కానీ సీపీఐ(ఎం)తో సీట్ల సర్దుబాటుపై స్పష్టత రాకపోవడంతో ఈ విషయాన్ని బయటి ప్రపంచానికి అధికారికంగా ప్రకటించలేదు. తీరా చూస్తే సీపీఐ(ఎం)కు ఇవ్వాలనుకున్న వైరా, మిర్యాలగూడ స్థానాల్లో టికెట్లు ఆశిస్తున్న కాంగ్రెస్ నేతల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైంది. బీహార్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సైతం ఇండియా కూటమిలో కలకలం రేపాయి. ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ కూటమి తదుపరి సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ఆసక్తి చూపకపోవడాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తప్పుబట్టారు. పాట్నాలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా "భాజాపా హటావో ? దేశ్ బచావో" ర్యాలీని ఉద్దేశించి జెడియూ చీఫ్ మాట్లాడారు.. మొత్తమ్మీద ఏ రాష్ట్రంలో చూసినా "ఎవరికి వారే యమునా తీరే" అన్నట్టుగా ముందుకు సాగుతున్నారు. సొంత బలంతోనే గెలిచేలా ఉన్నప్పుడు పొత్తులు ఎందుకు అన్న భావన కాంగ్రెస్‌లో కలిగిందా? అదే విపక్ష కూటమి ఐక్యతకు గండి కొడుతుందా? అసలేం జరుగుతోంది?

## మురుగు నీటిలో కాంగ్రెస్ అభ్యర్థి నిరసన

మేడ్చల్ – ప్రభాత సూర్యుడు :

మేడ్చల్ నియోజకవర్గం బొడుప్పల్,పీర్జాదిగుడా జంట కార్పొరేషన్ లోని చింతల చెరువు నుండి వదిలిన మురుగునీరు వల్ల దిగువన ఉన్న పలు కాలనీలలో మురుగు నీరు ప్రవహించడంతో పాటు దుర్వాసన తో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ పలు కాలనీలలో పర్యటించి ఎస్ఎన్డీపీ పనుల జాప్యం మంత్రి మల్లారెడ్డి నిర్లక్ష్యంగా వల్లే జనాలు ఇబ్బందులు పడుతున్నారు అని ధ్వజమెత్తారు. జంట కార్పొరేషన్ నాయకులు చేసిన కబ్జాల వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు.

# సామాన్యులకు ఎన్నికల కోడ్ కష్టాలు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :

తెలంగాణలో వింత పరిస్థితి ఎదురయ్యింది. ఓవైపు ఎన్నికల కోడ్.. మరోవైపు పెళ్లిళ్ల సీజన్. రెండు ఒకే సమయంలో రావడంతో కొత్త ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శుభకార్యాలు పెట్టుకున్న వారికి డబ్బుతోనే పని... ఏ పని చేయాలన్న డబ్బు అవసరం. మరోవైపు ఎన్నికల కోడ్... ఎక్కువ డబ్బు బయటకు తీసుకెళ్తే.. సీజ్ చేస్తున్నారు పోలీసులు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి.తెలంగాణలో ఇలా ఎన్నికలు కోడ్ అమల్లోకి వచ్చిందో లేదో.. అదే సమయంలో పెళ్లిళ్ల సీజన్ కూడా ప్రారంభమైంది. అంతేకాదు... ఎన్నిక కౌంటర్ పూర్తయ్యే సమయానికి మంచి మూహూర్తాలు కూడా అయిపోతాయి. దీంతో ఈ సమయంలో శుభకార్యాలు పెట్టుకున్నారు చాలా మంది. మరి.. పెళ్లి అంటే మామూలు విషయం కాదు కదా. అంతా డబ్బుతోనే పని. షాపింగ్ దగ్గర నుంచి... మండపం బుకింగ్, మంగళవాయిద్యాలు, కేటరింగ్, డెకరేషన్ అరేంజ్‌మెంట్స్.. ఇలా ఎన్నో ఉంటాయి. వీటన్నింటికీ లక్షల రూపాయలు అవసరం అవుతాయి. కొన్ని సందర్భాల్లో నగదు తీసుకెళ్లాల్సి వస్తుంది. ఇదే.. ఇప్పుడు సమస్యగా మారింది.ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పోలీసులు అడుగడుగునా చెకింగ్ చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకెళ్తే వాటికి రసీదులు అడుగుతున్నారు. ఆధారాలు లేకపోతే నగదును సీజ్ చేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లోనే కాదు... రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో కూడా పోలీసులు చెక్‌పోస్టులు పెట్టి మరీ తనిఖీలు చేస్తున్నారు. బైక్‌లను కూడా వదలడంలేదు. అనధికార లావాదేవీలు ఉంటే.. వెంటనే డబ్బు సీజ్‌చేస్తున్నారు.



ఈ పరిస్థితి... పెళ్లిళ్లు పెట్టుకున్న వారికి ఇబ్బందికరంగా మారింది.పెళ్లి అంటే.. లక్షల్లో ఖర్చవుతుంది. ఆ డబ్బును... అప్పుగానో.. లేక మరో విధంగానో సమకూర్చుకుంటారు కుటుంబసభ్యులు. అందులో అన్నింటికీ లెక్కలు ఉండవు. ఇక... పెళ్లిబట్టలు కొన్నాలన్నా లక్ష రూపాయల పైమాటే. ఇక నగల సంగతి చెప్పనక్కర్లేదు. పెద్ద మొత్తం ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. అయితే.. షాపింగ్‌కు డబ్బుతో వెళ్లే సమయంలో పోలీసులు ఆపితే... వారి పరిస్థితి ఏంటి. పోలీసులు నచ్చజెప్పి.. డబ్బుతో బయటపడేసరికి తలప్రాణం తోక్కొస్తుంది. ఇలాంటి అనుభవం ఇప్పటికే చాలా మందికి ఎదురైందట. దీంతో ఇదేం ఎన్నికల కోడ్, ఇవేం తిప్పలు అంటూ తలలు పట్టుకున్నారు పెళ్లింటి వారు. పోనీ, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పెళ్లిళ్లు, శుభకార్యాలు పెట్టుకుందామా అంటే... ఎన్నికల కోడ్ ముగిసే సరికి.. పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది. కోడ్ ముగిసే సమయానికి...శుభ ముహూర్తాలు కూడా అయిపోతాయట. ఇక చేసేది ఏమీ లేక... కోడ్ కష్టాలు అనుభవిస్తున్నారట.ఎన్నికల కోడ్ వల్ల.. శుభకార్యాలు పెట్టుకున్న వారికే కాదు... అత్యవసరం కోసం డబ్బులు అప్పుగా ఇచ్చేవారు కూడా... పోలీసుల తనిఖీల వల్ల వెనకడుగు వేస్తున్నారట. ఆ డబ్బు ఎక్కడిది అని పోలీసులు అడిగితే ఏం చెప్పాలో తెలియక.. అత్యవసరానికి అప్పు అడిగినా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారట. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడక తప్పని పరస్థితి ఏర్పడింది. అత్యవసర ట్రీట్‌మెంట్ కోసం హాస్పిటల్స్లో బిల్లులు చెల్లించేందుకు కూడా కొందరు కష్టాలు పడుతున్నారు. దాచుకున్న సోమ్ముకు ఆధారాలు ఎక్కడి నుంచి తేగలమని ప్రశ్నిస్తున్నారు.

# కమలంలో సీనియర్లు...తొడగొట్టారు...వెనక్కి తగ్గారు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :

తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనంటూ ప్రతి వేదికపై ప్రచారం చేస్తూ హడావుడి చేసిన కమలదళం.. సరిగ్గా ఆ సమయం వచ్చేసరికి తటాపటాయిస్తోందనే చర్చ జరుగుతోంది. పైగా ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు అసెంబ్లీకి పోటీ చేయాల్సిందేనంటూ ఆరు నెలలుగా హైకమాండ్ ప్రెషర్ పెడుతున్నా.. సీనియర్లలో కదలికే లేదని టాక్. సీనియర్లంతా తాము పార్లమెంట్ ఎన్నికల్లోనే పోటీ చేస్తామని చెబుతూ అసెంబ్లీ బరి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని టాక్ వినిపిస్తుంది.బీజేపీ అభ్యర్థుల జాబితా ఎప్పుడెప్పుడు వస్తుందా అని కార్యకర్తలు తెగ ఎదురుచూశారు. మొత్తానికి 52 మందితో ఫస్ట్ లిస్ట్ విడుదల చేశారు. కానీ, ఆ లిస్టులో ఎక్కడా సీనియర్లు కనిపించలేదు. రాజాసింగ్, ఈటల రాజేందర్, రఘునందన్ మినహా. ఇక రెండో లిస్టులోనైనా సీనియర్లు ఉంటారనుకుంటే అందులోనూ కార్యకర్తలకు నిరాశే ఎదురైంది.గెలిచేది తామే నంటారు, కానీ పోటీ చేయరు. పోటీచేయాల్సిన వాళు పార్టీలో ఉండరు, పార్టీలో ఉన్నవాళ్లు పోటీ చేయరు. ఈ రెండు స్టేట్‌మెంట్లు దాదాపు ఒకేలా ఉన్నా.. విడమరిచి చూస్తే ఒక్కో సెంటెన్స్‌లో చాలా అర్థం కనిపిస్తుంది. తెలంగాణలో అధికారం మాదే..! ఇప్పటికీ ఇదే మాట వినిపిస్తోంది భారతీయ జనతా పార్టీ నేతల నుంచి.. కానీ, ఆ డైలాగులు ఎవరైతే చెబుతున్నారో, గెలుస్తామని ధీమాగా చెబుతున్నారో.. వాళ్లే పోటీకి దూరంగా ఉన్నారు. స్వయాన పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తే.. అసెంబ్లీకి పోటీ చేయను, లోక్‌సభ ఎన్నికలే నా టార్గెట్ అంటుంటే.. ఇక కింది స్థాయి నేతల పరిస్థితేంటీ..? ఇదే ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా వినిపిస్తున్న ప్రశ్న.బీజేపీ గ్రాఫ్ పీక్స్‌లో ఉన్నప్పుడు.. సూపర్–30 మాదిరి ఫస్ట్ లిస్ట్ విడుదల చేస్తామన్నారు. ఆ జాబితాలో ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు, ఎంపీలుగా ఉన్న వాళ్లు, పబ్లిక్‌లో ఇమేజ్ ఉన్న వాళ్లు ఉంటారని చెప్పుకొచ్చారు పార్టీ ముఖ్యనేతలు. కిషన్‌రెడ్డితో సహా ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ఉన్నవాళ్లంతా పోటీ చేస్తారనే అనుకున్నారు. తీరా చూస్తే చాలామంది సీనియర్లు పోటీకి దూరంగా ఉన్నారు. పైగా డైరెక్ట్ స్టేట్‌మెంట్స్ కూడా ఇచ్చేస్తున్నారు. తాము ఈసారి అసెంబ్లీకి పోటీ చేయడం లేదంటున్నారు..ఓవైపు నామినేషన్లకు అందరూ సిద్ధం అవుతుంటే.. టికెట్ ఇస్తాం రండి అని అధిష్టానం పిలుస్తుంటే.. ఈ సమయంలో పోటీకి దూరం అని స్టేట్‌మెంట్లు ఇవ్వడం ఏంటి? పార్టీ ముఖ్యులకు తెలుస్తోందో లేదో గానీ తెలంగాణ సమాజానికి మాత్రం ఇది రాంగ్ సిగ్నల్ పంపుతోంది. బండి సంజయ్, అరవింద్ ధర్మపురి, సోయం బాపూరావు వంటి వాళ్లు సైతం అయిష్టంగానే అసెంబ్లీ బరిలో దిగారనేది పార్టీలోని కొందరు చెబుతున్న మాట. ప్రస్తుతానికి నలుగురు ఎంపీల్లో ముగ్గురు అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. అయితే ఇక్కడే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, సీనియర్ లీడర్ విజయ శాంతి.. వీళ్లందరూ ఎందుకు పోటీ చేయడం లేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇదంతా చూస్తుంటే బీజేపీ సీనియర్ల అభిమతం ఎలా ఉందో గానీ.. ఇటు క్యాడర్‌లో, అటు ప్రజల్లో ఇదే చర్చ జరుగుతోంది. పైగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోతే.. మళ్లీ వాళ్లనే పార్లమెంట్ బరిలో కూడా దింపుతారు. సో, రెండుసార్లు భారీగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పుడు పోటీ చేయకపోవడానికి ఈ భయం కూడా ఓ కారణం అన్న చర్చ మొదలైంది.గద్వాల జేజమ్మ డీకే అరుణ తాను పోటీ చేయడం లేదని తేల్చి చెప్పేశారు. బీజేపీలోని మరో సీనియర్ నేత జితేందర్ రెడ్డి సైతం పోటీకి దూరంగా ఉన్నారు. ఆయన బదులు తన కుమారుడికి బీఫామ్ ఇప్పించుకున్నారు. ఇక మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా లోక్‌సభకే పోటీ తప్పా.. అసెంబ్లీకి కాదంటున్నారు. ఎంపీ లక్ష్మణ్ తాను రాజ్యసభ సభ్యుడి అంటూ చెబుతున్నారు. మరో సీనియర్ లీడర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని గవర్నర్ స్థానంలో పంపించారు. ఇక మల్కాజిగిరి అసెంబ్లీ నుంచి పోటీచేస్తారని ప్రచారం జరిగిన రామ చంద్రరావు. వీళ్లంతా పోటీకి దూరంగానే ఉన్నారు. ఇలా అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉండడాన్ని బీజేపీ అధిష్టానం ఏమనుకుంటోందో గానీ.. క్యాడర్ మాత్రం ఓటమిని ముందే అంగీకరించినట్లేనని ఫీల్ అవుతోంది. పైగా రోజుకో సీనియర్ లీడర్ వెళ్లిపోతున్నా, ఉన్న సీనియర్లు పోటీ చేయబోమని చెప్పేస్తున్నా జాతీయ నాయకత్వం లైట్ తీసుకోడాన్ని కూడా కొందరు సహించలేకపోతున్నారు. ఇంతే స్తబ్దుగా ఉంటే మాత్రం.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి పార్టీ ఉనికి కోల్పోయిన ఆశ్చర్యం లేదనే అభిప్రాయాన్ని గట్టిగానే వినిపిస్తోంది.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి లాంటి వాళ్లు బీఆర్ఎస్‌ను ఓడించేది కాంగ్రెస్సేనంటూ వెళ్లిపోయారు. పార్టీలో చేరిన స్వామిగౌడ్, దాసోజు శ్రవణ్ లాంటి నేతలను నిలుపుకోలేకపోయారు.కానీ, ఆ లిస్టులో ఎక్కడా సీనియర్లు కనిపించలేదు. రాజాసింగ్, ఈటల రాజేందర్, రఘునందన్ మినహా. ఇక రెండో లిస్టులోనైనా సీనియర్లు ఉంటారనుకుంటే అందులోనూ కార్య కర్తలకు నిరాశే ఎదురైంది.ఇదిలావుంటే భారతీయ జనతా పార్టీ కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలంటే లోక్‌సభ స్థానాల్లోనే గెలవాలి. అందుకే.. సీనియర్లను పక్కనపెడుతున్నదన్న వాదనలు విని పిస్తు న్నాయి. బీజేపీలో జరిగిన అంతర్గత మీటింగ్‌లోనూ.. పార్లమెంట్ ఎన్నికల్లోనే తాము పోటీ చేస్తామని సీనియర్లు చెప్పినందునే ఈ రెండు లిస్ట్‌లలో వాళ్ల పేర్లు లేవు అనే చర్చ జరుగుతోంది. ఫైనల్‌గా జనంలో వినిస్తున్న టాక్ ఒక్కటే. సీనియర్లు పోటీకి దూరంగా ఉండడం అంటే దేర్ ఈజ్ సమ్‌థింగ్.. సమ్‌థింగ్.. అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ధాంక్యూతో సరి పెట్టిన కాంగ్రెస్

హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :

ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపులు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నికల నామినేషన్లు ఈ రోజు నుంచి ప్రారంభం కాగా.. పార్టీలన్నీ ఇప్పటికే ప్రచారంలో వేగం పెంచాయి. అలాగే అభ్యర్థులను కూడా దాదాపు పార్టీలన్నీ ప్రకటించాయి. ఎన్నికల పోలింగ్‌కు కొద్ది రోజులు మాత్రమే సమయం ఉండటంతో పొత్తులపై కూడా క్లారిటీ వస్తుంది. కాంగ్రెస్‌తో సీపీఎం, సీపీఐ పొత్తు ఖరారు అవుతుందని అందరూ భావించగా.. సీట్ల సర్దుబాటు కొలిక్కి రాకపోవడంతో కుదరలేదు. ఈ సమయంలో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బిగ్ ట్విస్ట్ ఇచ్చారు.తొలుత కాంగ్రెస్‌లో వైఎస్సార్‌టీపీ విలీనం చేయాలని షర్మిల భావించగా.. హస్తం పార్టీతో అవగాహన కుదరకపోవడంతో వెనక్కి తగ్గారు. కానీ ఇవాళ అనూహ్యంగా షర్మిల ఊహించని ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన షర్మిల.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ పోటీ చేయడం లేదని, కాంగ్రెస్‌కు సపోర్ట్ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌టీపీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులందరూ కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. ఓటు బ్యాంక్ చీలకూడదనే కారణంతో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. మీడియా ముందు ప్రకటించడమే కాకుండా.. కాంగ్రెస్‌కు మద్దతివ్వడంపై రాహుల్ గాంధీకి షర్మిల లేఖ కూడా రాశారు.ఈ క్రమంలో షర్మిల చేసిన ప్రకటనపై తెలంగాణ కాంగ్రెస్ స్పందించింది. థ్యాంక్యూ షర్మిల గారు అంటూ తెలంగాణ కాంగ్రెస్ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్ట్ పెట్టింది. ఈ సందర్భంగా షర్మిలకు ధన్యవాదాలు తెలిపింది. కాంగ్రెస్‌కు మద్దతివ్వడంతో రాహుల్ గాంధీకి రాసిన లేఖను వైఎస్ షర్మిల తన అధికారిక ట్విట్టర్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. దీనిని షేర్ చేసి టీ కాంగ్రెస్.. థ్యాంక్యూ షర్మిల అంటూ రిప్లై ఇచ్చింది. దీంతో ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.అయితే కేసీఆర్ నీచ పాలనను అంతమొందించేందుకే కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు షర్మిల మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయని, కేసీఆర్‌ను అధికారం నుంచి దించడానికి ఎలాంటి కఠిన నిర్ణయానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. కాగా కాంగ్రెస్‌లో విలీనం కుదరకపోవడంతో షర్మిల ఒంటరిగా బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారు. 119 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపుతున్నామని, ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విలీనానికి రేవంత్ రెడ్డి అడ్డుకట్ట వేశారని, అందుకే షర్మిల విలీనంపై వెనక్కి తగ్గారనే ప్రచారం నడిచింది. కానీ ఏమైందో ఏమో కానీ చివరికి మళ్లీ కాంగ్రెస్‌కే షర్మిల జై కొట్టడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

## మా సేవలు..అభివృద్ధి

# మీ కంటి ముందే కన్పిస్తొంది

**-ప్రజలకు ప్రయోజనం చేకూర్లేలా బీఆర్ఎస్ పథకాలు**
**-కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్**



**మంథని - ప్రభాత సూర్యుడు :** మా సేవలు..అభివృద్ధి మీ కంటి ముందే కనిపిస్తున్నాయని మమ్మల్ని ఆశీర్వదించి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా శనివారం మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేట, గొల్లగూడెంలలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐదేండ్లు ఏ పని చేయకుండా ప్రజలు సమస్యలు చెప్పుకుంటే మా ప్రభుత్వం లేదని చెప్పారని, అలాంటి వాళ్లు ఎన్నికల వస్తున్నాయని కమ్యూటినీ హాల్‌లకు నిధులు వెచ్చించడం మభ్యపెట్టడం కాదా అని అన్నారు. ప్రజలపై ప్రేమ ఉంటే ఏడాదికి కొన్ని నిదులు తీసుకువచ్చినా ఐదేండ్లలో ఎంతో అభివృద్ధి జరిగేది కాదా అని ఆయన అన్నారు. నోట్ల సంచులతో వచ్చి బీఆర్ఎస్ పార్టీ నాయకులను, ప్రజాప్రతినిదులను కొనుగోలు చేస్తున్నారని ఆయన వివరించారు. అనేక ఏండ్లు ఈ ప్రాంతంలో పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ పాలకులు ఏం చేశారని ప్రజలు ఆలోచన చేయాలని, ప్రజలు చైతన్యం చెందితేనే అభివృద్ధిని సాధించుకుంటామన్నారు. గతంలో బోయిన్‌పేట, గొల్లగూడెం ఎలాంటి స్థితిలో ఉండేదో ఈనాడు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంత మార్పు జరిగిందని ఆలోచించాలన్నారు. పనిచేసే నాయకులు ఎవరో ఓట్ల కోసం వచ్చే నాయకులు ఎవరో గమనించాలన్నారు. ఇన్నేండ్లలో మంథని నియోజకవర్గంలో ఒక బీసీ బిడ్డగా ఎదిగితే అణిచివేసే ప్రయత్నాలు చేస్తున్నారని, తనలాంటి వాళ్లను అడ్డు తప్పిస్తే ఇక తమకు ఎదురే ఉండదని బావించి కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రజలను దూరం చేయాలని చూస్తున్నారని ఆయన వాపోయారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా జెడ్పీ చైర్మన్‌గా తాను, సర్పంచ్‌గా మున్సిపల్ చైర్ పర్సన్‌గా తన బార్య ఎంతో అభివృద్ధి చేశామని, అనేక సేవలు చేశామని ఆయన గుర్తు చేశారు. మీరు ఇంటి నుంచి బయటకు వస్తే మా సేవలు, మేం చేసిన అభివృద్ధి కన్పిస్తుందన్నారు. కానీ కాంగ్రెస్సోళ్లు ఏం చేసిండ్లో ఏం చేస్తరో చెప్పే పరిస్థితిలో లేరన్నారు. మన గురించి మన ఆకలి కష్టాల గురించి పట్టించుకోనోళ్లు ఈనాడు మళ్లీ మనవద్దకు ఓట్ల కోసం వస్తున్నారని, అలాంటి వాళ్లకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గ్యారెంటీ వారంటీ లేని పథకాలు కాంగ్రెస్‌వని, ఈనాడు పథకాల పేర్లు చెప్తున్న కాంగ్రెస్ నాయకులు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించాలన్నారు. సీఎం కేసీఆర్ గొప్ప పథకాలు అమలు చేస్తుంటే వాటిని మేం కూడా అమలు చేస్తున్నామని చెబుతున్నారని, పదేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రూ.200ల ఫించన్‌ను రూ.201 పెంచలేని చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం,సీఎం కేసీఆర్ గొప్పగా ఆలోచన చేసి ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేస్తున్నారని, ప్రతి పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలను అమలు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రభుత్వ పథకాలతో పాటు తన సొంతంగా అనేక బృహత్తర సేవలు అందిస్తామని, మీ బిడ్డల భవిష్యత్‌బాధ్యత తానే తీసుకుంటానని హమీ ఇచ్చారు. ఈ నెల 7న మంథనిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రతి ఒక్కరు తరలిరావచ్చి విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్బంగా పిలుపునిచ్చారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయంలో

# ఏసీబీ అధికారులు దాడులు

**ఇద్దరు సిబ్బంది అరెస్టు**



**నిర్మల్ - ప్రభాత సూర్యుడు :**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. నర్సాపూర్ జి మండలంలోని చాక్ పల్లి గ్రామంలోని ఒక ఇంటిని గిఫ్ట్ డిడ్ రిజిస్ట్రేషన్ కోసం 8 వేల రూపాయల లంచం తాత్కాలిక ఉద్యోగి రాజు, సీనియర్ అసిస్టెంట్ అరుణ్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

# టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో చేరికలు

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు :**
కొడంగల్ నియోజకవర్గం దుద్యాల ఎంపీటీసీ ఎల్లప్ప, పోలేపల్లి ఎంపీటీసీ వెంకటయ్య, రుద్రారంకు చెందిన పలువురు బీఆరెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు టీపీసీసీఛీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో బీఆరెస్ నుంచి కాంగ్రెస్ లో చేరారు. జూబ్లీహిల్స్ నివాసంలో వారికి కండువా కప్పి రేవంత్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

# మీ మొహంలో చిరునవ్వు కోసమే రాజకీయాల్లోకి వచ్చా

**- ఢిల్లీ చేతులలో బానిసలం అవుదామా**
**పాడి కౌశిక్ రెడ్డి**



**హుజురాబాద్ -ప్రభాత సూర్యుడు :**
ఆరు గ్యారెంటీలు పక్కన పెట్టండి...మీ పార్టీకే గ్యారెంటీ లేదు ప్రమాణం చేసి చెపుతున్నాను వావిలాల ని మండలం చేసి చూపిస్తా నేను రాజకీయాల్లోకి వచ్చిందే మీ మొహంలో చిరునవ్వు చూడడం కోసమని, ఒక్క అవకాశం ఇచ్చి నన్ను గెలిపిస్తే హుజురాబాద్ నియో జకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని హుజురాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జమ్మికుంట లోని నగరం, నగురం, వావిలాల,పాపక్కపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను ఘనంగా పెట్టి తెలంగాణ సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. సాధించిన తెలంగాణ ను ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి పదానికి నడిపించిన మహర్షి కేసీఆర్ అన్నారు. ఇక్కడ లేని విధంగా 24 గంటల కరెంటు తో పాటు 19 వేల కోట్లు రుణమాఫీ చేసి రైతుల మనసులలో చెరగని ముద్ర వేసుకున్నారు అన్నారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలకు ఓటు వేసి గెలిపిస్తే తెలంగాణ పాలన ఢిల్లీ కి వెళ్తుందని, మరోసారి తెలంగాణ ప్రజలు ఢిల్లీ చేతుల్లో బానిసలు అవుతారని అన్నారు. అభివృద్ధి చెందిన రాష్ట్రం అంధకారంలోకి పోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కొత్త మేనిఫెస్టో రూపొందించారని, మేనిఫెస్టోలో పేద ప్రజల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఇందులో ముఖ్యంగా కెసిఆర్ ధీమా ఇంటింటికీ భీమా అని తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబంలో ఎవరైనా పోషకులు మరణిస్తే ఆ కుటుంబానికి ఈ పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇవ్వనున్నామని అన్నారు. సౌభాగ్య లక్ష్మి పథకంతో ప్రతి మహిళకు నెలకు 3000 రూపాయాలు అందజేయనున్నామని, దీంతోపాటు గ్యాస్ సిలిండర్ ని కూడా కేవలం 400 కే అందజేస్తామన్నారు. అంతేకాకుండా అన్నపూర్ణ పేరిట తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్న బియ్యం ఇస్తామన్నారు. ఆరోగ్యశ్రీని కూడా ఐదు లక్షల నుంచి 15 లక్షలకు పెంచుతామన్నారు. పెన్షన్ కూడా దఫలవారీగా 5000 వరకు పెంచుతామని, వికలాంగుల పెన్షన్ కూడా 4000 నుంచి 6000కు పెంచనున్నామన్నారు. బీసీ బందు, గృహలక్ష్మి పథకాలు పెట్టుకున్న అందరికీ కూడా ఎలక్షన్ అనంతరం చెక్కులు పంపిణీ చేస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసమే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ ల పథకాన్ని తీసుకొచ్చిందని, అసలు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదన్నారు. తెలంగాణ ప్రజలు చాలా తెలివైన వారు అందుకే కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదన్నారు. నన్ను గెలిపించిన వెంటనే వావిలాల ను మండలం చేసి చూపిస్తా అన్నారు. మీ దండం పెట్టి అడుగుతున్న హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవాలంటే ఒక్క అవకాశం ఇవ్వాలంటూ కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పింగళి రమేష్ ,నాగారం గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్, పాటు తదితరు నాయకులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధి చేసిన ఘనత గువ్వల

**బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించండి**
**గ్రామ ఎంపీటీసీ సభ్యులు కాశినాదం**





**నాగర్ కర్నూల్ - ప్రభాత సూర్యుడు :** గ్రామ అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్ని అపాయిపల్లి ఎంపీటీసీ సభ్యులు కాశినాదం అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా లోని లింగాల మండలం అపాయిపల్లి గ్రామంలో బీ ఆర్ ఎస్ పార్టీ ప్రచారం ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు కాశినాదం మాట్లాడుతు గ్రామ అభవృద్ధి కి నిధులు మంజూరు చేసి గ్రామ రూపు రేఖలు మార్చిన ఘనత గువ్వల బాలరాజు అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం గ్రామాలలో కోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి కి కృషి చేశారని అన్నారు. వృద్దులకు, వితంతువులకు,2000 పెన్షన్ మంజూరు చేశారని,వికలాంగులకు 4016 అమలు చేశారని. రైతులకు రైతు బంధు ఏకరాకు 10 వెలు,రైతు బీమా 5 లక్షలు, మహిళా సంఘాల కు పావలా వడ్డీ రుణాలు అందజేయడం. చిన్న గ్రామాలను జీ పీ లు గా మార్చారని, ప్రతి గ్రామ పంచాయతి కి భవనాలు మంజూరు చేశారని. గ్రామాలలో సి సి రోడ్ లు, డ్రైనేజీ లు, స్కూల్ అభివృధి, 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మి, శాధి ముభరక్, ప్రతి గర్భిణీ స్త్రీల కు అమ్మ ఒడి పథకం అమలు చేశారని అన్నారు, నవంబర్ 30 న జరిగే అసెంబ్లీ ఎన్నికల లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ను గెలిపించాలని కోరారు. డిసెంబర్ 3 కు బీ ఆర్ ఎస్ పార్టీ అధికారం లోకి వచ్చిన వెంటనే మహిళా సంఘాల కు స్వంత భావనలు నిర్మాణం, కే సీ ఆర్ ఆరోగ్య రక్ష 15లక్షలు, అన్న పూర్ణ పథకం కింద తెల్ల రేషన్ కార్డు ఉన్నా ప్రతి ఒక్కరి కి సన్నబియ్యం, గ్యాస్ సిలిండర్ 400 కే, మహిళలకు సాబాగ్య లక్ష్మి కింద 3000, కే సీ ఆర్ ధీమా భీమా ప్రతి ఇంటికి 5 లక్షలు, రైతు బంధు మొదటి ఏడాది 12000, దశల వారీగా 5 ఏండ్లలో 16000, అసర పెన్షన్ 5016, దశల వారీగా పెంపు, ఇలాంటీ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తామని వారు పిలుపునిచ్చారు. ఇల్లు ఇల్లు తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారం లో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ పర్వతాలు. బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మొగిలి మహేష్, వార్డు సభ్యులు నరేష్, బళ్ళారి రాము, తది తరులు పాల్గొన్నారు.

# రాజకీయ మార్పు ద్వారానే అభివృద్ధి సాధ్యం

**-సునీల్ రెడ్డి సమక్షంలో సామల అశోక్ బిజెపిలో చేరిక**

**మంథని-ప్రభాతసూర్యుడు:** మంథని నియోజకవర్గంలో ఈసారి రాజకీయ మార్పు ద్వారానే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బిజెపి అసెంబ్లీ అభ్యర్థి చంద్రుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. శనివారం మంథని పట్టణంలోని పద్మశాలి వీధికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు సామల అశోక్ తన అనుచరులతో కలసి బిజెపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్ రెడ్డి సమక్షంలో బిజెపి పార్టీ లో చేరారు. వీరికి సునీల్ రెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో రాజకీయ మార్పు ద్వారానే నిరుపేదల బ్రతుకులలో వెలుగులు నిండుతాయని ప్రజలలో దృడ విశ్వాసం తోటే బిజెపి పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. మంథని అభివృద్ధి కేవలం బిజెపి పార్టీ తోటే సాధ్యమని నమ్మి బీజేపీ పార్టీలో ప్రజలు స్వచ్ఛందంగా భారీగా చేరుతున్నారని అన్నారు. ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒకసారి రాజకీయ మార్పు కోరుకొని ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మంథని అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాను అని అన్నారు. అధికార పార్టీ బి ఆర్ ఎస్ కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులుగాని పెట్టే ప్రలోభాలకు లోను కావద్దని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మంథని పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి,అసెంబ్లీ నియోజకవర్గ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎడ్ల సాగర్ కోశాధికారి పార్వతి విష్ణు, సీనియర్ నాయకులు కొరబోయిన మల్లికార్జున్, మైనారిటీ మోర్చా పట్టణ అధ్యక్షులు షరీఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215